నియామకం


తుప్పత్ ఆనంద్

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా తుప్పత్ ఆనంద్ నియమితులయ్యారు. ఈమేరకు అధ్యక్షుడు ఏర్పుల మహేష్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఈటల రాజేందర్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షుడు ఏర్పుల మహేష్, తలారి రవి యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత


నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్లు తదితరులు

అల్వాల్: జీహెచ్ఎంసీ అల్వాల్, మల్కాజిగిరి సర్కిళ్లలో ఎస్ఎఫ్ఐగా పనిచేసే నాగరాజు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాగరాజు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయగా కార్పొరేటర్లు రాజ్ జితేంద్రనాథ్, ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరిస్తాం

గౌతంనగర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని మల్కాజిగిరి డీసీ రాజు అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సోమవారం శానిటేషన్, ఎలక్ట్రికల్ విభాగాలపై ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నూతన కమిటీ ప్రతినిధులు



బోడుప్పల్: బీజేపీ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ నూతన కమిటీ ప్రతినిధులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో అధ్యక్షులు ఏర్పుల మహేష్, ప్రధాన కార్యదర్శులు తుప్పత్ ఆనంద్, బజారు కిరణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు గండిపల్లి రాజు, కిశోర్, శరత్‌చంద్రారెడ్డి, రవి, కార్యదర్శులు రాజిరెడ్డి, కాంతారెడ్డి, చంద్రశేఖర్, విజయరెడ్డి కోశాధికారి నవీన్ తదితరులున్నారు.

ప్రతి కాలనీకి సీసీ రోడ్డు


న్యూరాంనగర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

ఉప్పల్: ప్రతి కాలనీ, బస్తీకి సీసీ రోడ్డు వేయించనున్నట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. న్యూరాంనగర్ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్లను వేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, డీఈ వెన్నెల, జగన్, శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్లు


కంకర తేలి ప్రమాదంగా మారిన రోడ్డు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ, వెంకటాద్రినగర్, చిన్మయ మార్గ్ ప్రాంతాల్లోని రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రోడ్డు నిర్మాణాలు జరగకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి వరద పొంగి పారుతోంది. దీంతో రోడ్డుపై కంకర తేలి ప్రమాదకరంగా ఉంటున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

రారండోయ్.. ఎంజాయ్ చేద్దాం..

నగరవాసులను ఆహ్వానిస్తున్న శివారు ప్రాంతాలు	సెలవు రోజుల్లో కుటుంబాలతో కలిసి ప్లాన్	కిటకిటలాడుతున్న పార్కులు, రిసార్ట్లు

మూడువైపులా విస్తరించిన మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో నివసిస్తున్న ప్రజలు వీకెండ్ వచ్చిందంటే చాలు నగర శివారు ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయమే ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు. చిన్నాపెద్దా మరిచిపోయి సంతోషంగా గడుపుతున్నారు. గుండెల నిండా 'ఆక్సిజన్' నింపుకొని.. కళ్లలో పచ్చదనాన్ని దాచుకొని.. ఉత్సాహంగా ఆడిపాడి.. రిసార్ట్స్‌లోని స్విమ్మింగ్ పూల్స్‌లో జలకాలాడి సంతోషంగా ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు పర్యాటక శోభను సంతరించుకుంటున్నాయి.

– మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వం అభివృద్ధి చేసిన కండ్లకోయ ఆక్సిజన్ పార్క్, నారపల్లి నందన వనం, జటాయువు పార్క్, కీసరగుట్ట వనం, నాగారం ఆరోగ్యవనం(లంగ్స్ పార్క్)తో పాటు శామీర్‌పేట్‌లోని జింకల పార్క్, తెలంగాణ టూరిజం రిసార్ట్‌లతో పాటు శామీర్‌పేట్ మండలంలో ప్రఖ్యాత రిసార్ట్‌లు నగరవాసులను అమితంగా ఆకర్షిస్తున్నాయి.

పార్కులలో అన్ని వసతులు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్కులలో అన్ని వసతులు కల్పించారు. వాకింగ్ ట్రాక్, ఫొటో షూట్ పాయింట్స్, పిల్లలు ఆడుకునేందుకు వసతులు కల్పించారు. 50 నుంచి 70 ఎకరాలలో పార్కులను అభివృద్ధి చేసి కుటుంబ సమేతంగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

శామీర్‌పేట్ రిసార్ట్స్‌లో ఫుల్ ఎంజాయ్

ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న శామీర్‌పేటలో రిసార్ట్స్, ప్లే జోన్స్, లేక్ వ్యూ, గార్డెన్ వ్యూ కాటేజెస్ పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. శామీర్‌పేట పెద్ద చెరువు, కట్టమైసమ్మ ఆలయానికి భక్తులు, టూరిస్ట్‌లు అధికసంఖ్యలో వస్తున్నారు. శామీర్‌పేట మండల పరిధిలో సమ్మర్ గ్రీన్ రిసార్ట్, అలంకృత రిసార్ట్, లియోనియా హోలిస్టిక్ డెస్టినేషన్, సెలబ్రిటీ రిసార్ట్, డిస్ట్రిక్ట్ గ్రావిటీ గేమ్స్ జోన్‌లో ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నాయి.

కీసరగుట్టలోని హుడా పార్కు

ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసరగుట్ట శ్రీభవానీరామ లింగేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనం తర్వాత కీసరగుట్ట ప్రధాన ఆలయం దిగువన ఉన్న హుడా పార్కు (శ్రీరామ లింగేశ్వరస్వామి దేవస్థానం ఉద్యానవనం)లో గడుపుతున్నారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేస్తున్నారు. ఇక్కడ ఉన్న పెద్ద మర్రిచెట్లు ఆకట్టుకుంటున్నాయి.


నారపల్లిలోని భాగ్యనగర నందనవనం పార్కు

నారపల్లి భాగ్యనగర నందనవనం

భాగ్యనగర నందనవనంలోని జింకల పార్కు ప్రత్యేక ఆకర్షణ. 118 ఎకరాలలో విస్తరించిన నందనవనంలో 1.5 కిలో మీటర్ల వాకింగ్ ట్రాక్ ఉంది. రకరకాల ఆట వస్తువులతో ఏర్పాటు చేసిన ప్లే గ్రౌండ్‌లో పిల్లలు ఆడుకోవడానికి ఎక్కువగా వస్తున్నారు. పచ్చదనం పరుచుకున్న వాతావరణం ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. నిత్యం 200 నుంచి 300 వరకు సందర్శకులతో పార్కు సందడిగా ఉంటోంది. జింకల గుంపులతో పాటు పెద్ద సంఖ్యలో నెమళ్లు కనిపిస్తుంటాయి. పక్షుల రాగాలతో సందర్శకులు ఫిదా అవుతున్నారు.

కండ్లకోయ ఆక్సిజన్ పార్క్‌లో ఆహ్లాదం

కండ్లకోయలోని ఆక్సిజన్ పార్క్‌లో ప్రత్యేకంగా విదేశీ పక్షులు పెంచుతున్నారు. ఈ పార్కులో ప్రజల కోసం వాకింగ్ పాత్‌వే, యోగా సెంటర్, గెజిబో, వాటర్ ఫౌంటెయిన్, రచ్చబండ తదితర ఏర్పాట్లు చేశారు. అటవీ ప్రాంతం ఫీల్ వచ్చేలా కర్రలతో బ్రిడ్జీలు ఏర్పాటు చేశారు. నాగారం ఆరోగ్యవనంలో సుమారు 40 ఎకరాల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు.



కండ్లకోయలోని ఆక్సిజన్ పార్కు


ఆక్సిజన్ పార్కులో వాక్ వే


నారపల్లిలోని భాగ్యనగర నందనవనం పార్కులో..


శామీర్‌పేట్ పెద్ద చెరువు

ఆలయాలు ప్రశాంత నిలయాలు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


ప్రత్యేక పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి ఏకోన వింశతి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలను రెండో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆలయాలు ప్రజలకు ప్రశాంత నిలయాలుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, మూల మంత్ర హవనం, 9 గంటలకు శ్రీచక్రార్చన, 10గంటలకు నక్షత్ర నవగ్రహపాశుపత హోమం, సామూహిక చండీ హోమం, మహాసరస్వతి అనుగ్రహం కోసం హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు మండప ఆరాధన, శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామీజీచే ప్రవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, నకాష్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్న క్రాంతి కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారంలో నేతలు

బోడుప్పల్: చెంగిచర్ల చిన్న క్రాంతికాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేపట్టారు. అధ్యక్షుడిగా మేడ బాపిరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా శివకుమార్ పటేల్ ఎన్నికయ్యారు. వారిని మాజీ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, బీజేపీ అధ్యక్షులు ఏర్పుల మహేష్, నాయకులు బింగి యోగేశ్‌యాదవ్, రాసాల కుమార్ యాదవ్ వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బాపిరాజు మాట్లాడుతూ స్థానిక నాయకులు, అధికారుల సమన్వయంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్‌లో ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో డ్రైనేజీ అవుట్‌లెట్ లేకపోవడంతో డ్రైనేజీ రోడ్లపై నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ బాక్స్ డ్రైన్‌తో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు గౌతమ్, వినోద్ గౌడ్, సీతారామరాజు, సోమోజి, భుజంగరావు, సంతోష్, రవికాంత్, శ్రీను, బీఆర్ఎస్ నాయకులు జోలి రమేష్, నరేందర్‌రెడ్డి, శోభన్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, సందీప్‌రెడ్డి, హనుమాన్‌చారి, తిరుపతయ్య, సతీష్, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్


బ్యాడ్మింటన్ విజేతలతో ఉప్పల శ్రీనివాసగుప్తా

మల్లాపూర్: హోటిం డియా స్పోర్ట్స్ క్లబ్, మల్కా బ్యాడ్మింటన్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన మేడ్చల్ జిల్లా బ్యాడ్మింటన్ 2025 ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఛాంపియన్‌షిప్ బాయ్స్–11 విన్నర్‌గా జై.శివ, అండర్–19 విన్నర్‌గా శన్ముఖ్ జయంత్, జూనియర్ ఉమెన్ అండ్ మెన్ టీమ్‌లు బ్యాండ్మింటన్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేతులమీదుగా బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కోశాధికారి వికాష్ హర్ష, కార్యదర్శి భాస్కర్, జాయింట్ సెక్రటరీ నాగరాజు, రమేష్, వేణు, మోహన్, మోహన్ దాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ నర్సింహనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నర్సింహనగర్, శివ హోటల్ రోడ్, అన్నపూర్ణ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, ఎస్ఎస్ నగర్, మీర్‌పేట్ సాయిగార్డెన్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

నాచారంలో..

నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ (కాకతీయ కర్షక్) 11కేవీ రాంరెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. దీంతో దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, అంబేద్కర్‌నగర్, కమలా బాయినగర్, హనుమాన్ నగర్, సావర్కర్ నగర్, రాంరెడ్డినగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్‌నగర్ తదితర కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయనికి సహకరించాలని కోరారు.

బీరప్పగడ్డలో రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీరప్పగడ్డ వాసులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలో రోడ్డు ఆక్రమణకు గురవుతోందని, పారిశుద్ధ్య పనులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు సోమవారం ఉప్పల్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆంజనేయులకు ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. నాలాపై నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, శివకుమార్, లక్ష్మీనారాయణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్ మెట్రోస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వయస్సు 40 నుంచి 45 వరకు ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన స్థానికులు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్ పిలిపించి పరిశీలించగా సదరు వ్యక్తి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ కట్టింగ్‌పై అధికారుల సీరియస్ వార్నింగ్


కాప్రా డివిజన్‌లో తవ్విన రోడ్డు

కాప్రా: సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా రోడ్లను తవ్వేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే రోడ్లను తవ్వేస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల ఇలా రోడ్లు వేస్తున్నారో లేదో అలా వారి అవసరాల కోసం తవ్వేస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించిన ప్రజాధనం దుర్వినియోగమవుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే రోడ్ల తవ్వకాలపై కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సీరియస్ వార్నింగ్ ఇస్తున్నారు. కాప్రా డివిజన్‌లో పలు కాలనీల్లో అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇంకొందరు అయితే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుని అధికారుల నుంచి పర్మిషన్ రాకుండానే తవ్వకాలు మొదలు పెడుతున్నారు. కాప్రా నేతాజీనగర్ సమీపంలోని ఓ కాలనీలో ఓ వ్యక్తి డ్రైనేజీ పైప్‌లైన్ కోసం తవ్వకాలు నిర్వహించారు. అందుకు సదరు వ్యక్తి రోడ్ కటింగ్ ఛార్జీలు విధించారు ఇంజినీరింగ్ విభాగం అధికారులు. ఆ తరువాత మరోచోట మరో వ్యక్తి రోడ్ కట్ చేయడంతో సదరు వ్యక్తి కూడా రోడ్ కటింగ్ ఛార్జీలు విధించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రోడ్ల తవ్వకాల విషయాన్ని సీరియస్‌గా తీసుకుని, ఎవరైనా అనుమతులు లేకుండా రోడ్లను తవ్వితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను తవ్వొద్దని ఇంజినీరింగ్ విభాగం డీఈ బాలకృష్ణ సూచించారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


మల్లాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మల్లాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం బడీడు పిల్లలు బడిలో చేరాలని మల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పద్మారావు మాట్లాడుతూ.. పిల్లలను బడిలో చేర్పించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, ఏఐ ద్వారా బోధన వంటివి ప్రభుత్వం పాఠశాలలో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారథి, శ్రీదేవి, సీమారాణి, లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వాణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి


జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు అనిల్ కిషోర్‌గౌడ్, జోలి రమేష్, నరేందర్, వెంకన్న, రాముయాదవ్, అనిల్, రాములు, కిట్టు, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి


తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న కానాజిగూడ హరిత ఎన్‌క్లేవ్‌వాసులు

అల్వాల్: కాలనీ అభివృద్ధికి ఉన్న అడ్డంకులను తెలపాలని కోరుతూ కానాజిగూడ హరిత ఎన్‌క్లేవ్ వాసులు అధికారులను కోరారు. కానాజిగూడ సర్వే నంబర్–374లో ఏర్పాటైన హరిత ఎన్‌క్లేవ్‌లో ఇటీవల భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదని ఇందుకు గల కారణాలు తెలపాలని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అల్వాల్ మండల తహసీల్దార్ రాములును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీకి సంబంధించిన అన్ని రెవెన్యూ రికార్డులను కోర్టు పత్రాలను అధికారులకు అందజేసినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.